క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: మండల పరిధిలోని 33 కేవీ రాచులూరు, 33 కేవీ ముచ్చర్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రమేష్ తెలిపారు. శనివారం చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని, అందువల్ల నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు రాచులూరు, లేమూరు, గూడూరు, ముచ్చర్ల సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హుడాకాంప్లెక్స్, కమలానగర్, శారదానగర్, సరూర్‌నగర్, పుష్పాగార్డెన్స్, డెంటల్ కళాశాల, నేతాజీనగర్, నర్సింహాపురి కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు. 11కేవీ మన్సూరాబాద్, సిరీస్, హుడాసాయినగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫారలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

ఎస్ఎన్‌డీపీ పనుల పరిశీలన


ఎస్ఎన్‌డీపీ పనులు పరిశీలిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని 3వ డివిజన్, సాయి బాలాజీ టౌన్‌షిప్ కాలనీలో చేపడుతున్న వరదనీటి కాలువ (ఎస్ఎన్‌డీపీ) పనులను శుక్రవారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రమాణాలతో వరద కాలువను పూర్తి చేయాలని కోరారు. వర్షాలు, వరదలు రాకముందే పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామిడి మాధురి, సుదర్శన్‌రెడ్డి, డీఈఈ జ్యోతి, ఏఈ వినీల్‌గౌడ్, వీరకర్ణారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ రక్తదానం చేయండి


కందుకూరులో రక్తదానం చేస్తున్న డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి తదితరులు

కందుకూరు: రక్తదానంతో మరో మనిషి ప్రాణాలను కాపాడవచ్చని, ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. కుందకూరులో మహేంద్రకుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా భూలక్ష్మి ఆస్పత్రిలో శుక్రవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా కోశాధికారి తాళ్ల అంజయ్య, మండల కార్యదర్శి వెంకటేశ్వర్లుగుప్తా, కోశాధికారి రామస్‌బాబు, సభ్యులు ఉమ్మారెడ్డి రమాకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వే


తుక్కుగూడలో సర్వేను పరిశీలిస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో అనాథ పిల్లల సర్వే శుక్రవారం నిర్వహించారు. రెండవ రోజు మున్సిపల్ టీమ్ సభ్యులు ఇంటింటా తిరిగి అనాథ పిల్లల వివరాలను సేకరించారు. పిల్లలు ఎవరి సంరక్షణలో ఉన్నారని ఆరా తీశారు. తుక్కుగూడలో జరుగుతున్న సర్వేను కౌన్సిలర్ రవి నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ టీమ్ సభ్యులకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రభుత్వం వారికి చేయూతను ఇవ్వడానికి ఈ సర్వే చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు గూడూరుకు మంత్రి రాక

కందుకూరు: గూడూరులో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి శనివారం రానున్నారని జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో కూడా మంత్రి పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

నిర్వాసితుల నిరసన దీక్షలు


వంటా వార్పు కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

బడంగ్‌పేట్: మా భూమి మాకు కావాలి అని బడంగ్‌పేటకు చెందిన దళిత కుటుంబాలు దీక్ష చేస్తున్నారు. దావుత్ ఖాన్‌గూడలోని సర్వే నంబర్-2లోని భూములు తమకే చెందాలని బాధితుల చేస్తున్న దీక్ష శుక్రవారంతో 13వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దళితులు వంటా వార్పు చేసుకుని అక్కడే నిద్రిస్తున్నారు. వీరికి ఎంఆర్‌పీఎస్ మద్దతు ప్రకటించింది. అనంతరం బాధితులు మాట్లాడుతూ మంత్రి సబితారెడ్డి భూములు తమకే చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ సబితారెడ్డి 13 రోజులగా నిరసనలు చేస్తున్న దళిత కుటుంబాలను పరామర్శించక పోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు బొర్ర రవి, రాము తదితరులున్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తుల బారులు


ఎంపీడీఓ కార్యాలయంలో ధరఖాస్తులు అందజేస్తున్న లబ్ధిదారులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గృహలక్ష్మి పథకానికి ధరఖాస్తు చేసుకోవడానికి లబ్ధిదారులు బారులు తీరారు. మీ–సేవా కేంద్రాలకు ఆదాయ, ధ్రువపత్రాలు, ఆహార భద్రతా కార్డుల కోసం పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. దీంతో మండల కేంద్రంలోని మీ–సేవా కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లు లబ్ధిదారులతో కిటకిటలాడాయి. ఎంపీడీఓ కార్యాలయంలోని కౌంటర్లలో ధరఖాస్తులు అందజేస్తున్నారు. రెండు రోజుల్లో మొత్తం 1,155 ధరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నిధులు కోసం మంత్రికి విజ్ఞప్తి

మహేశ్వరం: పెండ్యాల–అమీర్‌పేట్ మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా మార్చి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం మంత్రి సబితారెడ్డిని పెండ్యాల ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. పెండ్యాల నుంచి అమీర్‌పేట్ గ్రామం వివిధ పనుల నిమిత్తం, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాలంటే మట్టి రోడ్డు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వర్షం పడితే రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోందన్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని వాపోయారు. పెండ్యాల–అమీర్‌పేట్ గ్రామాలను కలిపే రోడ్డుకు నిధులు మంజూరు చేసి పనులు త్వరగా ప్రారంభించాలని మంత్రిని కోరారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెండ్యాల ఉప సర్పంచ్ ఎండీ. గౌస్, బీఆర్ఎస్ నాయకులు మంత్రి రాజేశ్, ఆశోక్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పలువురు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు దళితుల ఉసురు తప్పదు

- లాక్కున్న భూములను వెంటనే వెనక్కి ఇవ్వాలి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


బడంగ్‌పేటలో మాట్లాడుతున్న ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

బడంగ్‌పేట్: కేసీఆర్‌కు దళిత బిడ్డల ఉసురు తగులుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బడంగ్‌పేటలోని దావుత్‌ఖాన్‌గూడ సర్వేనంబర్– 2లో 'మా భూములు మాగ్గావాలె' నినాదంతో దళితులు చేస్తున్న నిరసన దీక్షలకు గురువారం ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూ కబ్జాల పాలన సాగుతోందని మండిపడ్డారు. భూములు కోల్పోయిన లక్షలాది మంది పుట్టెడు దుఃఖంలో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. దళితులు.. మూగజీవుల వంటి వారు.. భూములు లాక్కున్నా ఏమీ అనరనే అధికారులకు హుకూం జారీ చేశాడని మండిపడ్డారు. గత ప్రభుత్వాలు కడు బీదలకు ఇచ్చిన భూములను గుంజుకోవడం ఏమిటని ధ్వజమెత్తారు. దళితుల నుంచి సేకరించిన భూములను వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. దావుత్‌ఖాన్‌గూడ భూ నిర్వాసితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎవరు బెదిరించినా, అరెస్టులు చేసి కేసులు పెట్టినా భయపడవద్దని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గం అధ్యక్షుడు గుడ్ల శ్రీనివాస్, నాయకులు చిత్రం శ్రీను, భూ బాధితులు ఉన్నారు.

వార్డు అభివృద్ధికి నిరంతర కృషి

ఆమనగల్లు: పట్టణంలోని 9వ వార్డులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ సోన జయరాంనాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, అంతర్గత కాల్వలు నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుత్తి బాలస్వామి, రూపం వెంకటరెడ్డి, శంకర్, సాయిబాబా, జగదీశ్వర్, ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు ఏడీఏగా సుజాత


సుజాత, ఏడీఏ

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ శాఖ డివిజన్ కార్యాలయ ఏడీఏగా సుజాత శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో ఇటీవల ప్రభుత్వం నూతన వ్యవసాయ కార్యాలయం మంజూరు చేసింది. దీని పరిధిలోకి ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆమనగల్లు పట్టణంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయంలోనే ఏడీఏ కార్యాలయం ఏర్పాటు చేశారు. మహేశ్వరంలో ఏడీఏగా పనిచేస్తున్న సుజాతకు అదనపు బాధ్యతలు అప్పగించడంతో ఆమనగల్లు ఏడీఏగా బాధ్యతలు స్వీకరించారు.

పట్టాలిస్తున్నాం.. అమ్ముకోవద్దు

- నిర్వాసితులకు పట్టాల పంపిణీ
- వారం లోపే పొజిషన్‌లోకి ఆదేశం
- గృహలక్ష్మికి దరఖాస్తు చేసుకోండి
- మంత్రి సబితారెడ్డి


నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సబితారెడ్డి

బడంగ్‌పేట్: ఏఆర్‌సీఐ, జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయాల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలో గురువారం రాత్రి ఇళ్ల పట్టాలను మంత్రి సబితారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పట్టా భూములను అమ్ముకోవద్దని సూచించారు. 60 గజాలు కేటాయించిన పట్టాలను 75 గజాలుగా పెంచి రైతులకు ఇవ్వాలని ఆర్‌డీవోను ఆదేశించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక జీవో తీసుకురావడంతో ఇది సాధ్యమైందని తెలిపారు. కులాలు, పార్టీలకు అతీతంగా న్యాయం చేశామన్నారు. పట్టాదారులు వారం లోపే పొజీషన్‌లోకి వెళ్లాలని ఆదేశించారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో సూరజ్‌కుమార్, ఎమ్మార్వో మాధవి, మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, స్థానిక కార్పొరేటర్ రోహిణి, మాజీ సర్పంచ్‌లు జంగయ్య, బాలమణి, నాయకులు భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, రమేశ్, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సంబురాలు


సంబురాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు రావడాన్ని బీఆర్ఎస్ నేతలు స్వాగతించారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీశైలం రహదారిపై టపాసులు కాల్చి, సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు కృష్ణ రాంభూపాల్‌రెడ్డి, ఎంపీటీసీలు రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీరాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం రాజేశ్వరీదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, మంత్ర పుష్పం, పుష్పలంకరణతో పాటు భక్తులు పూజలు నిర్వహించారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, ఆలయ డైరెక్టర్లు, ఆలయ పూజారులు పలువురు పాల్గొన్నారు.

మండలం ప్రకటించేవరకు దీక్షలు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి అన్నారు. గట్టు ఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరహార దీక్షలు శుక్రవారం కూడా కొనసాగించారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి సందర్శించి మాట్లాడారు. మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్, చంద్రయ్య, పాండు, కృష్ణయ్య, అనంతరాములు, చెన్నయ్య, పవన్ వాల్మీకి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

అధిక శ్రావణమాస పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

మీర్‌పేట: శివసాయినగర్ కాలనీలోని శ్రీగౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీగణపతి ఆలయంలో అధిక శ్రావణమాస పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శుక్రవారం బీజాక్షరి సహిత ఐశ్వర్యలక్ష్మి హోమం, కుంకుమార్చన కార్యక్రమాలను వేద పండితులు శ్రీకాంత్‌శర్మ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఐశ్వర్యలక్ష్మి హోమంతో పాటు పూర్ణాహుతి కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సుభాష్‌రెడ్డి, ప్రధాన అర్చకులు లక్ష్మి గణపతిరావు, సంతోశ్‌రెడ్డి, వెంకట కృష్ణారావు, వెంకటరమణ, రామచంద్ర శర్మ, రామకృష్ణ, చంద్రకాంత్, టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్య జనార్ధన్ రావు పాల్గొన్నారు.

ఖబరస్థాన్‌ను రద్దు చేయాలని వినతి


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: ఖానాపూర్ ప్రభుత్వ భూమిలో మంజూరైన ఖబర్‌స్తాన్‌ను రద్దు చేయాలని ఎంపీటీసీ సరితాగణేష్‌గుప్తా, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీనగర్ కాలనీలోని సబితాఇంద్రారెడ్డి స్వగృహంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖానాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ముస్లింలకు ఖబర్‌స్తాన్ నిర్మించాలని ఇటీవల ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, దాన్ని రద్దు చేసి ఆ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు నిమిత్తం ఆ భూమిని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, నర్సింహా, శంకర్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి


వస్పుల శ్రీశైలం

ఆమనగల్లు: దరఖాస్తుల స్వీకరణకు గడువు పొడిగించాలని జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు వస్పుల శ్రీశైలం డిమాండ్ చేశారు. మద్యం దుకాణాలకు టెండర్లు వేయడానికి దాదాపు 15 రోజుల గడువు ఇచ్చిన ప్రభుత్వం దీనికి 3రోజులే ఇస్తారా అని ఆయన ప్రశ్నించారు. పట్టణంలో శుక్రవారం శ్రీశైలం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రాజకీయ లబ్ధికోసం ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఎన్నికల ముందు టీఆర్ఎస్ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తామని ఆయన చెప్పారు.

రోడ్లపై మురుగు..పట్టించుకొనేవారెవరు?


ఎన్‌టీఆర్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై పారుతున్న మురుగు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్ నగర్‌లోని ప్రధాన రోడ్డుపై గత కొన్ని నెలలుగా మురుగు నీరు పారుతోంది. ప్రతి రోజూ వందలాది మంది వాహనదారులు, పాదచారులు ప్రయాణించే ఈరోడ్డుపై డ్రైనేజీ పొంగడంతో వాహనదారులు, పాదచారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో పొంగుతున్న డ్రైనేజీ వాసనతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ వలన దోమలు బెడదతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ సమస్యను శాశ్వత పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు


కడ్తాల్: విరాళం అందజేస్తున్న వర్తక వ్యాపారస్తులు

కడ్తాల్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని ఎస్ఐ హరిశంకర్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హార్డ్‌వేర్, సిమెంట్, ప్లేవుడ్ దుకాణాల యజమానులు రూ.30వేలు, పాన్ బ్రోకర్లు రూ.40వేలు, ఎల్ఎన్ చికెన్ సెంటర్ నిర్వాహకుడు లక్ష్మయ్య రూ.5వేలు ఎస్ఐ హరిశంకర్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను తగ్గించొచ్చన్నారు. వీటి ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, వర్తక వ్యాపార సంఘం అధ్యక్షుడు పిప్పల వెంకటేశ్, గంట శ్రీనివాస్, రాజేందర్‌యాదవ్, పెంటారెడ్డి, లక్ష్మయ్య, ఓంప్రకాశ్, సురేశ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి తోడ్పాటు

కడ్తాల్: మహిళలు స్త్రీనిధి బ్యాంకు లింకేజీల నుంచి రుణాలు పొంది ఆర్థికంగా అభివృద్ధి చెంది సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో మండల అధ్యక్షురాలు జంగమ్మ ఆధ్వర్యంలో వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలకు ఉపయోగపడేవిధంగా వివిధ రకాల వస్తువులను తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఏపీఎం రాజేశ్వరి, డీఎం కృష్ణ పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి


దొడ్లపహాడ్‌లో పర్యటిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ప్రజలకు సేవ చేసే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం దొడ్లపహాడ్ గ్రామంలో శుక్రవారం సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. గ్రామంలోని వివిధ దేవాలయాల్లో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మగుడి, కాటమయ్య దేవాలయం, వీరనాగమ్మ దేవాలయ నిర్మాణాలకు ఆర్థికసాయం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న గౌని దస్రమ్మ సర్జరీకి అవసరమైన ఆర్థికసాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ నిరంజన్, నిరంజన్‌గౌడ్, జంగయ్య, శ్రీనివాసులు, పెద్దయ్య, అంజయ్య, యాదయ్య, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యను పరిష్కరించండి

పల్లెచెలక గిరిజనులు ఎమ్మెల్సీకి వినతి


ఎమ్మెల్సీ కసిరెడ్డికి వినతిపత్రం అందజేసిన గిరిజనులు

కడ్తాల్: పోడు భూముల సమస్యను వెంటనే పరిష్కరించాలని పల్లె చెలక గిరిజనులు ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 300 కుటుంబాలకు చెందిన తాము మూడు తరాలుగా 1100 వందల ఎకరాల మాసుర భూమిని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పోడు భూములపై హక్కులు కల్పిస్తున్న నేపథ్యంలో తమను కూడా గుర్తించి పోడు భూములపై హక్కులు కల్పించాలని వారు కోరారు.

పేదలకు అండగా ఉంటా

సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ

యాచారం: గ్రామంలోని పేదలకు అండగా ఉంటానని నందివనపర్తి సర్పంచ్ కంబాలపల్లి ఉదయశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం జెనిగ రాములు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని ఏ పేదవాడు కష్టాల్లో పడకుండా ఉండేందుకు తన వంతు సాయం అందజేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రామదాసు, మహేందర్, శ్రీశైలం, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



దిల్‌సుఖ్‌నగర్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవి అన్నారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ కేబినెట్ ఇన్‌స్టాలేషన్ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ రవి మాట్లాడుతూ, విద్యార్థి దశ ప్రతి ఒక్కరి జీవితంలో ఎంతో ముఖ్యమైనదని అన్నారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు.కేబినెట్ ఇన్‌స్టాలేషన్‌లో పలు తరగతుల్లో ఎంపికైన వారికి బ్యాడ్జీలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్ నరసింహ, ప్రైమరీ ఇన్‌చార్జి రోహిణి తదితరులు పాల్గొన్నారు.